క్లుప్తంగా

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు దామర ప్రభాకర్ సూచించారు. గురువారం స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అమీలియో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి చికిత్స చేసి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్యాబినెట్ ట్రెజరర్ టీవీ రత్నప్రసాద్, జీఎస్‌టి కె. శ్రీనివాసబోస్, కార్యదర్శి ఎం.లోకేష్, సభ్యులు పీవీ రాజ్‌కుమార్, ఆర్‌టీసీ మేనేజర్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌ను తొలగించొద్దు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని తెలుగుతల్లి విగ్రహం ఎదుట ఉన్న ఆటో స్టాండ్‌ను తొలగించొద్దని సీఐటీయూ ఓల్డ్ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి మారేళ్ల విజయ్ కోరారు. గురువారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి పల్లెటూళ్లకు చెందిన ఆటోలు వచ్చి అక్కడే ఆగి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయన్నారు. అలాంటి ఆటోస్టాండ్‌ను తొలగిస్తే మండలంలోని గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్, హుస్సేనయ్య పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల ఆదరణ చూపాలి


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): వృద్ధుల పట్ల ఆదరణ చూపాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. గురువారం స్థానిక బుధవారపేటలోని ఆదరణ డే కేర్ సెంటర్‌లో ఆయన నిత్యావసరాలను పంపిణీ చేసి, మాట్లాడారు. పలు చోట్ల వృద్ధులను దూషించడం, హింసించడం వంటి ఘటనలు జరుగుతుండటం బాధాకరమన్నారు. అవసాన దశలో అండగా ఉండాలని సూచించారు.

పాము కాటుపై అవగాహన అవసరం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యార్థులు పాము కాటుపై అవగాహన కలిగి ఉండాలని అనిమల్ యాక్టివిస్ట్ మహమ్మద్ ఇద్రిస్ సూచించారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని బీఆర్ అంబేద్కర్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నేలపై నిద్రించేటప్పుడు దోమ తెరలు వాడితే అందులోకి పాము వచ్చే అవకాశం లేదన్నారు. పాము కనబడగానే దూరంగా వెళ్లాలని, రాత్రిపూట తప్పకుండా టార్చిలైటు ఉంచుకోవాలని సూచించారు. అనేక జాతుల పాములు ఉన్నా.. కేవలం 4 జాతుల పాములు మాత్రమే విషపూరితమైనవన్నారు. పాము కాటుకు గురైనపుడు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికెళ్లి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు కళలు

కర్నూలు కల్చరల్: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలు కళలు అని, అలాంటి కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ అకాడమీ ద్వారా చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇచ్చి వారిని అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అకాడమీ అధ్యక్షులు భార్గవ్‌కుమార్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలను త్వరగా ఏర్పాటు చేయండి

కర్నూలు(సెంట్రల్): అన్ని నియోజవకర్గాల్లో బూత్ కమిటీల నియామకాల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, సమన్వయ కమిటీలకు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు సూచించారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున అన్ని పోలింగ్ బూతుల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. యువకులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఊపు వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు అధికంగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో నగర అధ్యక్షుడు జాన్‌విల్సన్, నాయకులు దామోదరం రాధాకృష్ణ, బతుకన్న, బజారన్న, షేక్‌ఖాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం మళ్లీ రావాలి

- గతంలో ఏ ప్రభుత్వాలు చేయని మేలు చేశాం
- హామీలు ఇచ్చి మోసగించిన ఘనుడు చంద్రబాబు
- అబద్ధాలతో అందలం ఎక్కేందుకు ఎత్తులు
- జగన్ పాలనలో ఎవరి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాల అమలు
- ‘వై ఏపీ నీడ్స్ జగన్’లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామయ్య


ప్రకాష్ నగర్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు మంచి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లోనూ గెలవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. గురువారం స్థానిక 49వ వార్డు ప్రకాష్ నగర్ ప్రాంతంలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి.. ఆ కుటుంబానికి ప్రభుత్వం చేసిన మేలు, చేకూరిన లబ్ధిని చెప్పారు. చంద్రబాబు 2014 ఎన్నికల ముందు ఇచ్చి విస్మరించిన హామీలు, సీఎం జగన్ చెప్పి ఆచరించిన పథకాలను వివరించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పాలనను అర్థమయ్యేలా చెప్పి, వారి మద్దతుతో స్టాంప్ వేయించారు. ఈ సందర్భంగా బీవై మాట్లాడుతూ సీఎం జగన్ బాధ్యతలు చేపట్టాక అర్హతే ప్రమాణికంగా, అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అవినీతికి హద్దు లేదన్నారు. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు వచ్చేవని, వారికి అడిగినంత ఇస్తేనే సిఫార్సులు చేసేవారని చెప్పారు. పేదల కష్టాలను కళ్లారా చూసి హామీలిచ్చిన జగన్‌ను ప్రజలు ఆశీర్వదించారని, దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి రహిత, పారదర్శకవంతమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా అర్హతే ప్రమాణికంగా మంజూరు చేసే విధానాన్ని తీసుకొచ్చారని, దీంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమ అవుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, నాలుగున్నరేళ్లలో చేసిన ప్రతి మంచి పనితో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇది ఓర్వలేని టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించేందుకు ప్రజల వద్దకు వెళ్లి చెప్పేందుకు ప్రజల్లోకి వచ్చామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అరుణ, కార్పొరేటర్లు కృష్ణకాంత్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, శ్రీనివసరావు, ఆర్షియ, జుబేర్, షేక్ అహ్మద్, క్లస్టర్ కన్వీనర్ ఆది మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, కేదార్ నాథ్; చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిశీలించండి

- కమిషనర్ భార్గవ్‌తేజ


మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(టౌన్): ఓటరు జాబితాపై అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో బూత్ స్థాయి అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రామాణిక ంగా తీసుకొని అభ్యంతరాలను పరిష్కరించాలన్నా రు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, రెవె న్యూ ఆఫీసర్ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

డ్రైన్ ఓవర్‌ఫ్లో, కెనాల్ లీకేజీల పరిశీలన

స్థానిక ఆనంద్ థియేటర్ వద్ద డ్రైన్ ఓవర్‌ఫ్లో, కెనాల్ లీకేజీపై ఫిర్యాదుల నేపథ్యంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సాయంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యను తెలుసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్‌ను ఆదేశించారు. గుత్తి పెట్రోల్ బంకు వద్ద చేపడుతున్న వెండర్ జోన్, చిల్డ్రన్స్ పార్కులోని గ్లో గార్డెన్ పనులు, కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలను పరిశీలించి వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ గోపాలక్రిష్ణయ్య, క్రిష్ణ లత, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఏఈ భానుప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం సంకల్ భాగ్‌లోని గీతా ప్రచార ధామంలో గీతా జయంతి పోస్టర్లను వివిధ ధార్మి సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లా వారికి డిసెంబర్ 21వ తేదీ ఉదయం 9 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామం, నంద్యాల జిల్లా వారికి 24వ తేదీన నంద్యాలలోని గీతా మందిరం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో పోటీలు జరుగుతాయన్నారు. నాలుగు విభాగాల్లో పోటీలు ఉంటాయని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059802265, 944100867677 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, డీఎస్పీ మహబూబ్ బాషా, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ దాస్, ధర్మప్రచార మండలి సభ్యులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, మారం నాగరాజు గుప్త, అనిల్, పసుపులేటి నీలిమ, రామచంద్రారెడ్డి, వెంకట రమణ, రమేష్, డాక్టర్ చిట్టి నరసమ్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): నగరానికి చెందిన అహ్మద్ బాషా, డోన్‌కు చెందిన మాధవరం శంకర్‌రెడ్డి ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామంలోని సర్వేనంబర్ 29సి, 37ఎ, 37బిలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనధికారికంగా నిర్వహిస్తున్న క్రషర్‌ను, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

కల్లూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం కల్లూరు మండల పరిషత్ ఆవరణలో సామాజిక బహిరంగ తనిఖీ సమావేశం నిర్వహించారు. పీడీతో పాటు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేష్, డ్వామా పరిపాలన అధికారిని (ఏఓ) విజయలక్ష్మి, ఏపీడీ లక్ష్మన్న, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయత్ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి, ఏపీఓ మద్దేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌విహార్ బస్‌స్టాప్‌లోకి బస్సులకు నో ఎంట్రీ

కర్నూలు(రాజ్‌విహార్): రాజ్‌విహార్‌లోని బస్ స్టాప్ (పాత ఆర్టీసీ డిపో)లోకి శుక్రవారం నుంచి బస్సులకు అనుమతి ఉండదని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వెంకటరామం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌స్టాప్‌లో చేపడుతున్న సిమెంట్, తారు రోడ్డు పనుల నిర్మాణం కారణంగా నెల రోజుల పాటు బస్సులు రోడ్డుపైనే ప్రయాణీలకు ఎక్కించుకుని వెళ్తాయని, నంద్యాల, నందికొట్కూరు, డోన్, అనంతపురం, ఆత్మకూరు, శ్రీశైలం కడప, తిరుపతి వెళ్లే ప్రయాణికులు గమనించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

పాణ్యం: మండల పరిధిలోని కొలూరు గ్రామానికి చెందిన చెట్ల పుల్లయ్య (36) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. గురువారం గ్రామ సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలువ వద్ద పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గుర్తించిన స్థానికులు శాంతిరామ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సుంకేసుల వద్ద ఇంటెక్ వెల్ పరిశీలన


సుంకేసుల వద్ద ఇంటెక్ వెల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్లు

కర్నూలు (టౌన్): మండలంలోని సుంకేసుల రిజర్వాయర్ వద్ద చేపట్టాల్సిన ఇంటెక్ వెల్‌ను గురువారం జలవనరుల శాఖ, ప్రజారోగ్య సాంకేతిక శాకఖ మున్సిపల్ ఇంజినీర్లు పరిశీలించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచనల మేరకు జలవనరుల శాఖ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ప్రజారోగ్య శాఖ అనంతపురం ఎస్‌ఈ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రమోహన్ రావు, కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర రెడ్డి, మున్సిపల్ ఈఈ శేషసాయి, డీఈఈలు, ఏఈలు సుంకేసుల రిజర్వాయర్‌ను పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు ప్రాంతాలు విలీనమైన కర్నూలులో నగర వాసులకు తాగు నీటి సమస్య తలెత్తకుండా సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.82 కోట్లతో పైపు లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. దీనికి అనుబంధంగా సుంకేసుల వద్ద ఇంటెక్ వెల్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే ఇక్కడ పనులు పూర్తి చేస్తామన్నారు.

వ్యాపార నైపుణ్యాలపై అవగాహన


స్టాళ్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: వ్యాపార నైపుణ్యాలను సాధించడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి తెలిపారు. గురువారం వ్యాపార దుకాణాల నిర్వహణ, వస్తువుల కొనుగోలు అంశాలపై కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మార్కెట్‌లో వ్యాపారాల నిర్వహణ గురించి, వినియోగదారులు వస్తువుల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

ఓటరు జాబితాల్లో తప్పులు సరిచేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు సిటీ: ఓటరు జాబితాల్లో తప్పులుంటే సరిచేయాలని ఆర్డీఓ హరిప్రసాద్ బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం స్టాంటన్‌పురం పోలింగ్ స్టేషన్‌లో బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాపై ఫిర్యాదులు వస్తే స్వీకరించి, ఆధారాలు తీసుకుని సరిచేయాలన్నారు. సమావేశంలో కర్నూలు తహసీల్దారు శివరాముడు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయరాదు


నీటి బాటిళ్లను పంపిణీ చేస్తున్న మెప్మా సీఎంఎం మురళీ

కర్నూలు (టౌన్): తాగునీటిని దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సీఎంఎం మురళీ సూచించారు. గురువారం అశోక్‌నగర్‌లోని వాటర్ వర్క్స్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి కోసం మహిళలు– మహిళల కోసం నీరు కార్యక్రమం నిర్వహించారు. వాటర్ వర్క్స్ వాటర్ ప్లాంట్, నీటిని ఎలా శుద్ధి చేస్తారన్న దానిపై పొదుపు మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా సీఎంఎం మాట్లాడుతూ నగరంలో ప్రతి ఒక్కరికి శుద్ధి చేసిన నీటిని అందించాలంటే ఎంతో ఖర్చవుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎంసీ సుధాకర్, భారతి, సీఓలు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల అభివృద్ధి

- మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు సిటీ: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల అభివృద్ధి సాధ్యమని వైస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు, నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు సచివాలయం-1 పరిధిలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అందిన మొత్తాన్ని తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలకు అర్హత అనేది రాజకీయ నాయకులు నిర్ణయించే వారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుందన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపిందని, లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వ ఫలాలు జమ చేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుందని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సీఎం జగనన్న విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అందుకే మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ అనురాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సి.బెళగల్ జెడ్పీటీసీ గిరిజోన్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు డి.వాసు, స్థానిక నాయకులు చిన్నలక్ష్మన్న, మోహన్‌బా బు, దిన్నెదేవరపాడు హరినాథ్ రెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కర్నూలు (టౌన్): స్థానిక పార్థసారధి అపార్టుమెంట్ పక్కన ఉన్న కొట్టాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నగర ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకుని నగర మేయర్ బీవై రామయ్య, నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అక్కడికి చేరుకుని వినతి పత్రం స్వీకరించి నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఏఈల పొరపాట్లపై విచారణ

కర్నూలు(రాజ్‌విహార్): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఏఈలపై దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విచారణ చేపట్టింది. గతంలో ఆదోనిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి సీటీ మీటర్ల ఏర్పాటులో తప్పుడు కనెక్షన్ ఇవ్వడంతో రూ.లక్షల్లో బిల్లు వచ్చింది. దీనిపై యజమాని ఫిర్యాదు చేయడంతో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశాల మేరకు విచారణ విభాగం ఎస్‌ఈ ఆదిశేషయ్య గురువారం కర్నూలుకు వచ్చి, ఏఈలు అనిల్, శాస్త్రిలను విచారించారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి


మాట్లాడుతున్న హఫీజ్ అత్తావుల్లా ఖాన్

కర్నూలు(సెంట్రల్): రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ అత్తావుల్లా ఖాన్ కార్యకర్తలకు సూచించారు. గురువారం బిస్మిల్లా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని బీజేపీ విభజించి పాలిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలంటే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు లింకన్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జహంగీర్ అహ్మద్ పాల్గొన్నారు.

నివాళి


సూర్యప్రకాష్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ హరిప్రసాదు, సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): రిటైర్డ్ డీఆర్వో సూర్యప్రకాష్ మృతికి ఆర్‌డీఓ హరిప్రసాదు సంతాపం ప్రకటించారు. ఆర్‌డీఓ కార్యాలయంలో సూర్యప్రకాష్ చిత్రపటానికి ఆయన ఏఓ వేణుగోపాల్, ఇతర సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

14న జాబ్ మేళా

కర్నూలు సిటీ: నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీలో ఈనెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(కడప), తోషిబా టాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్(హైదరాబాదు)లలో పనిచేసేందుకు ఆయా కంపెనీలు మేళా నిర్వహిస్తున్నాయన్నారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఎంఎంవీ మెకానిస్ట్, టర్నర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెండర్ ట్రేడ్స్ విద్యార్థులు బయోడేటా, టెన్త్ మార్కుల జాబితా, ఐటీఐ మార్కుల జాబితా, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, పాన్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేలు(ఉచిత వసతి, రాయితీపై భోజనం)వేతనం ఉంటుందన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఊళ్లోకే వైద్యం


ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఉన్న ఊళ్లోకే వైద్యాన్ని తీసుకొచ్చే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తెలిపారు. గురువారం దిన్నెదేవరపాడు గ్రామలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులందరికి ఆరోగ్యసేవలు అందుతున్నాయా, అవసరమైన వారికి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా అని ఆరా తీశారు. అవసరమైన వారందరికీ మందులు అందించాలని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న సమయంలో వైద్యులు ఆరోగ్యశ్రీ రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. అన్ని ప్రోగ్రామ్స్‌ను వంద శాతం పూర్తయ్యే విధంగా చూసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ సి.గురుశేఖర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గోవిందు డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, మద్దిలేటి, ఎల్లరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.